


## పుట్టుమచ్చలు

నూతన విద్యార్థికూటములో చేరిన యువకులలో రామం ఒకడు. పదేండ్ల వయస్సు మించిన బాలికలందరు అతనిదృష్టిపథంలోయుండేవారు. అతని చిలిపి చేష్టలకు కొందరు స్త్రీలు అసహ్య పడేవారు.

హొటలులో భోజనముచేయుచు, ఒక గదిలో బసపెట్టుకొని, ప్రణయ మేగ్జయినులను పారాయణచేయుచూ ఒంటరిగా స్వేచ్ఛాజీవనము చేయు విద్యార్థియైన రామంకు తనగది ఊడ్చే నిమిత్తం ఒక ఆడదాని కావలసి వచ్చెను. అతను బేరముచేయక అడిగినంత జీతం చెల్లించి ఒకపడుచుపిల్లను దాసీగా నియమించుకొనెను. ఆమె పేరు లక్ష్మి. గాని వృత్తిధర్మముచే అందరు లచ్చియని పిలచేవారు. ఆమె ప్రణయమును వాంఛించే రామం కొన్ని నూతన అవకాశములను కల్పించెను. హొటలుకు వెళ్లి భోజనముచేయుటకు బదులుగ కేరేజితో ఆమెద్వారా భోజనము బసకు తెప్పించేవాడు.

లోకంలో కూటికిపేదయైనను కులానికి పేదయైనవారుండరు. లచ్చి గౌరవ కుటుంబమునకు చెందిన పిల్ల. ఆమె పరపురుషులను సోదరులవలె భావించేది. ఆమె మనస్తత్వం రామంకు తెలియదు.

ఒకనాడు రామం వాలుకుర్చీలో కూర్చుని సిజర్‌సిగరెట్టుకాలుస్తూ లచ్చి చెయ్యిపట్టుకొనెను. అతని చూపులను బట్టి అతని తలలో చెలరేగే దురాలోచన లచ్చి గ్రహించింది. చెయ్యి విడిపించుటకు పెనగులాడింది. గాని ఆమె నిరాయుధురాలైనఅబల. వెంటనే అతని పెదిమల నడుమ యిమిడి యున్న కాలుచున్న సిగరెట్టును ఆమె అందుకొని అతని బుగ్గలపైని రెండు చురకలు పెట్టింది. ఇంతలో రామం చెయ్యిపట్టువిడింది. ఆమె గబగబ పరుగెత్తింది అంతే......

ఇప్పుడు రాముకు వరకట్నాలతో పెళ్లయింది. ఇద్దరు బిడ్డల తండ్రి కూడాను. అతని బుగ్గమీద లచ్చి పెట్టిన చురకల మచ్చలు శాశ్వతంగా ఉన్నాయి. యెవరైనా అడుగుతే అవి పుట్టుమచ్చలని రామం బొంకుతాడు.

ఎం. ఎస్. ప్రకాశం.

* * *

## దినచర్య

ప్రొద్దున్నే లేవటం, సరిగా ముఖమైనా కడగకుండా ఏకాఫీహొటల్లోకో దూరటం; పొట్టనిండా దిట్టంగా మెక్కటం; బయటికి రావటం, తరువాత వీధులవెంట తిరుగుతూ కొంతకాలాన్ని గడపటం, ఆ తరువాత ఏ లైబ్రరీలో దూరటం; అక్కడ ఏరాజకీయపు గొడవల్లోనోబడి తర్కవితర్కాలతో మరి కొంతకాలాన్ని అర్థంలేకుండా వ్యర్థం చేయటం; తదుపరి మధ్యాహ్నం ఏ ఒంటిగంటకో ఇంటికి చేరటం, "ఇంత వరకు ఎక్కడ తిరిగావురా" అని పెద్ద వాళ్ళు అడిగితే, వాళ్ళను దబాయించి ఏదో సాకుచెప్పి తప్పించుకోవటం; తరువాత రెండు మెతుకులు నోట్లోవేసుకొని మరల సాయంకాలానికల్లా ఏ సినిమాహాలుదగ్గరో చేరటం, అక్కడ ఆడవాళ్ళగేటుదగ్గరనుంచొని స్త్రీలవైపు క్రీగంటి చూపులుచూస్తూ పోజులు విసరటం; ప్రొద్దుకూకంగానే చీకటిమరుగుల్లో ఆడాళ్ళ వెంటపడటం; వాళ్ళచేత చెడామడా నాలుగు తిట్లుతినటం; ముఖం తెల్లచేయటం; గుడ్లు తేలవేయటం; తరువాత గుటకలు మింగుతూ నిరాశతో, నిస్పృహతో, నిస్సత్తువగా, కాళ్ళీడ్చుకుంటూ రాత్రి ఏ పదిగంటలకో ఇంటికి చేరటం.........

ఇది ఈనాటి చాలామంది యువకుల దినచర్య. కాదంటారా మీరు?

నంద్యాల కొండమాచార్యులు.

* * *

## డార్క్‌రూమ్‌లో బ్లాకు

ఒక కిరసీన్‌డీలర్ కోమటి చమత్కారముతో దొంగలాభాలు విరివిగా పొందేవాడు. ఒకరోజున జాలిగొలిపే మాటలతో ఒకాయన వచ్చి "నాకీవూళ్ళో కొత్తగ బడిపంతులుగా వేశా